క్లుప్తంగా

నేడు, రేపు టాలెంట్ వార్ పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహ్మద్ షకీల్ తదితరులు

డాబాగార్డెన్స్ : మిరాకిల్ ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 6,7 తేదీల్లో టాలెంట్ వార్ పేరిట ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ తెలిపారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో శుక్రవారం పోటీల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యం, వెస్టర్న్ డ్యాన్స్, సినిమా పాటలు, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్, పెద్దలకు వస్త్రాలంకరణ పోటీలు ఉంటాయన్నారు. అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చని చెప్పారు. పౌర గ్రంథాలయం వేదికగా 6వ తేదీ సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు, 7వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయని, పాల్గొనదలచిన వారు 9966485335, 9553333134 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



మోడల్ స్కూల్ విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ వసంతలక్ష్మి

అల్లిపురం : విద్యార్థులు చక్కగా విద్యనభ్యసించాలని 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి అన్నారు. డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు కిట్లను ఆమె ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం రుచి చూశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ఉపాధ్యాయులు వి.సునీత, మంగమ్మదేవి, భీశెట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో..

అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల జీవీఎంసీ మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, వెంకటేశ్వరమెట్ట–1 సచివాలయం అడ్మిన్ భార్గవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకమహాలక్ష్మి విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు సాయం



విద్యార్థికి చెక్కు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

మద్దిలపాలెం : ఓ విద్యార్థి చదువుకు కొత్త వెంకోజీపాలెం శ్రీసద్గురు సాయినాథ్ ట్రస్ట్ అండగా నిలిచింది. అనకాపల్లికి చెందిన శరగడం రాధాకృష్ణ సహకారంతో ఇక్కడి సాయినాథ ఆలయంలో పని చేస్తున్న బోర లక్ష్మి కుమారుడు యుగంధర్ చదువు కోసం ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు రూ.15 వేల చెక్కును శుక్రవారం ఆలయంలో ట్రస్ట్ సభ్యుల సమక్షంలో అందజేశారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టంతో కల్యాణం జరిపారు.

ఆరోగ్యానికి వాకింగ్

నేటి ఆధునిక కాలంలో పెద్దగా శ్రమ పడని వారు తప్పనిసరిగా **వాకింగ్** చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. గతంలో మన పెద్దలు ఇంటి **పని..** ఇతర పనులను స్వయంగా **చేసుకోవ** డం.. కిలోమీటర్ల కొద్దీ నడ**వడం వల్ల** వారికి పెద్దగా వ్యాయామం **అవసరం** ఉండేది కాదు. కానీ మనం **ఎటువంటి** శారీరక శ్రమ లేకుండా బతుకుతున్నాం. కనుక నేటి మానవుడికి వ్యాయామం.. వాకింగ్ తప్పనిసరి అని నిపుణులు పేర్కొంటున్నారు.

- సర్వ రోగ నివారిణిలా పని చేస్తున్న నడక
- ప్రతి ఒక్కరూ నడవాలని చెబుతున్న వైద్యులు

నడకతో ప్రయోజనాలు..

- **విటమిన్ డి లోపం ఉండదు. క్యాన్సర్ వ్యాధి సోకదు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.**
- మెదడు చురుగ్గా పని చేస్తుంది.
- మానవుని జీవిత కాలం పెరుగుతుంది.
- రక్తంలోని కొవ్వు కరుగుతుంది.
- ఎముకలు దృఢంగా తయారవుతాయి.
- శరీరానికి మంచి శ్వాస.. అధిక స్థాయిలో ఆక్సిజన్ అందుతుంది.
- క్రమం తప్పకుండా నడవడం వల్ల శరీరంలో హార్మోన్లు విడుదలై మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.
- **మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి వాటిని అధిగమించవచ్చు.**
- శరీరాకృతి బాగుంటుంది. గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ సక్రమంగా జరిగి సమర్థవంతంగా పని చేస్తాయి.
- గుండె సంబంధిత జబ్బులు, పక్షవాతం, నరాల బలహీనత వంటివి దరి చేరవు.
- అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి రోగాలను జయించవచ్చు.
- కీళ్లనొప్పులు తగ్గి, కండరాల శక్తి పెరిగి నడిచేందుకు వీలు కలుగుతుంది.



పార్కులో హుషారుగా నడుస్తున్న వాకర్లు

డాబాగార్డెన్స్ : నడక అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బరువు నిర్వహణలో సహాయ పడుతుంది. కండరాలు, కీళ్లను బలపరుస్తుంది. మానసిక శ్రేయస్సును పెంచుతుంది. రోగ నిరోధక శక్తిని ఇనుమడింపజేస్తుంది. మార్నింగ్ వాక్ వల్ల కాళ్లు, పొత్తికడుపు కండరాలు టోన్ అవుతాయి. 30 నిమిషాల రోజువారీ శక్తివంతమైన ఉదయపు నడక ఎముకల సాంద్రతను మెరుగుపరుస్తుంది.వృద్ధాప్యంలో ఆర్థరైటిస్, ఎముకల వ్యాధులు రాకుండా అడ్డుకుంటుంది.

ప్రజల్లో కనిపిస్తున్న మార్పు..

మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వాతావరణంలో మార్పుల కారణంగా ఊబకాయం, షుగర్, బీపీ, నరాల బలహీనత, కండరాల సమస్యలు రాకుండా ప్రజలు వ్యాయామం, నడకపై దృష్టి సారించారు. నడక చక్కటి ఆరోగ్య సూత్రమని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోగాల బారిన పడిన రోగులు మందులతో సరిపెట్టుకోకుండా నిత్యం వాకింగ్ చేస్తే మంచిదని చెబుతున్నారు. నేటి ఆహారపు అలవాట్లు, జీన్స్ కారణంగా ఊబకాయం సమస్య తీవ్రతరమైంది. ఇటువంటి దశలో వైద్యుడిని సంప్రదిస్తే నడవమని సూచిస్తున్నారు.

నడకకు ప్రాధాన్యం..

నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ సెంట్రల్ పార్క్, సరస్వతీ పార్క్, బీచ్‌రోడ్డు, ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం, లక్ష్మీ టాకీస్ పార్క్, డైమండ్ పార్క్, మెయిన్‌రోడ్డులో నిత్యం వేలాది మంది యువత, మహిళలు, చిన్నారులు, వృద్ధులు వాకింగ్ చేస్తున్నారు. సమయాన్ని బట్టి ప్రతి ఒక్కరూ వాకింగ్‌పై దృష్టి పెడుతున్నారు. ఉదయం వాకింగ్ వల్ల సూర్య కిరణాల ద్వారా లభించే కాల్షియం ఎముకలకు మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ శాతం మహిళలు ఉదయం వేళ వాకింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉదయం కుదరని వారు మాత్రమే సాయంత్రం వాకింగ్ చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో పలు వాకర్స్ క్లబ్‌లు ఏర్పడ్డాయి. వృద్ధుల నుంచి పిల్లల వరకు క్లబ్‌లు ఏర్పాటు చేసుకుని వాకింగ్, యోగా చేస్తున్నారు. వయస్సును బట్టి రోజుకు 30 నిమిషాల నుంచి గంటలోపు వాకింగ్ చేయాలని వైద్యులు చెబుతున్నారు.



పచ్చదనం ఒడిలో ప్రశాంత వాకింగ్

వాకింగ్ సర్వరోగ నివారిణి..



వాకింగ్ చేస్తుంటే ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. మానసిక ఒత్తిడి తగ్గడంతో వ్యాధుల బారి నుంచి విముక్తి కలుగుతుంది. బీపీ, షుగర్ వ్యాధులు సోకిన రోగులు నిత్యం వాకింగ్ చేయడంతో శరీరంలో కండరాలు, ఎముకలు గట్టి పడి ఆరోగ్యంగా కనిపిస్తారు. వాకింగ్ చేయని రోజు ఎంతో బద్ధకంగా ఉంటుంది. వాకింగ్ చేసిన వ్యక్తి నిత్యం యువకుడిలా కనిపిస్తాడు.

– లింగం శ్రీనివాస్, వాకర్, సరస్వతీ పార్క్

జీవిత కాలం పెరుగుతుంది..



నా వయసు 50 సంవత్సరాలు. నిత్యం వాకింగ్ వల్ల జీవిత కాలం పెరిగి యువకుడిలా పనులు చేయగలుగుతున్నాను. ఎన్నో ఏళ్లుగా వైఎస్సార్ సెంట్రల్ పార్క్ చుట్టూ ఉదయం వేళల్లో వాకింగ్ చేస్తున్నాను. ఇప్పటి వరకు ఎటువంటి వ్యాధుల బారిన పడలేదు. మంచి ఆహారం తీసుకుంటున్నాను.

– పసగాడ రామలింగేశ్వరరావు, వాకర్, వైఎస్సార్ సెంట్రల్ పార్క్

నైపుణ్యవంతమైన విద్యతో మెరుగైన అవకాశాలు



కళాశాల నుంచి ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపక బృందం

డాబాగార్డెన్స్ : నైపుణ్యంతో కూడిన విద్యనభ్యసిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్ (జేకేసీ), మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా జెన్‌ప్యాక్ట్ పేరిట శుక్రవారం జాబ్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జెన్‌ప్యాక్ట్ కంపెనీ సీనియర్ మేనేజర్లు సతీష్, శ్యాంసన్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ అధికారి రాజేష్ పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 256 మంది విద్యార్థులు పాల్గొనగా, వీరిలో 70 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో డి. అరుణపద్మ, విద్యాకల్పన, హైమావతి, సంతోషి, అనూష, డాక్టర్ శరణ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

కంచరపాలెం : గొల్లకంచరపాలెం దుర్గానగర్‌లో కొలువైన దుర్గమాంబ అమ్మవారి ఆలయంలో శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. ఆలయ ఆవరణలో భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

నష్టపరిహారం అందజేత

మహారాణిపేట : సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుని కుటుంబానికి ఏపీ మర పడవల సంఘం అండగా నిలిచింది. శుక్రవారం నష్ట పరిహారం కింద రూ. లక్ష రూపాయల చెక్కును బాధిత కుటుంబానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ అందజేశారు. ఇటీవల విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు చెందిన బోటులో కాకినాడ, వాకలపూడికి చెందిన మత్స్యకారుడు దున్న రమణ (53) వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో జారిపడి గల్లంతయ్యాడు. అతని కుటుంబానికి రూ. లక్షా 35 వేలు చెల్లించడానికి పెద్దల సమక్షంలో నిర్ణయించారు. అసోసియేషన్ తరఫున, బోట్ యజమాని తరఫున రూ.95 వేలు, అసోసియేషన్ అధ్యక్షుడు రూ.5 వేలు.. మొత్తం రూ.లక్ష బాధిత కుటుంబానికి అందజేశారు.గల్లంతైన మత్స్యకారునికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10 లక్షలు మత్స్యకార బీమా కోసం విశాఖ జిల్లా మత్స్య శాఖ జేడీ విజయ్ వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు వాసుపల్లి రాము, మైలపల్లి చిన్నా, అర్జిల్ల ఎర్ర అప్పన్న, అర్జిల్ల నరసింగ్, మైలపల్లి సింహాచలం, గుంటు దానయ్య , మైలపల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి జానకీరామ్

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

తిరుమలేశునికి అభిషేక సేవ



పూజలందుకుంటున్న తిరుమలేశుడు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలేశునికి అభిషేక సేవ నిర్వహించారు. స్వామి వారిని క్షీరంతో అభిషేకించారు. అనంతరం స్వామిని అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ముందుగా వేకువ జామునే సామూహిక లలితా పారాయణం చేశారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు యాదవ జగ్గరాజుపేట గ్రీన్ సిటీ ఆవరణలోని శ్రీలక్ష్మి ఆండాళ్ సమేత శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. వారం రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం భక్తి గీతాంజలి గానామృతం చేశారు. ముగింపు సందర్భంగా విశేష అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ : స్వచ్ఛత, వ్యాధులపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 39వ వార్డు క్వీన్‌మేరీ పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రత, వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకుంటే తల్లిదండ్రులకు తెలియపరుస్తారన్నారు. దీని వలన ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రం అవుతాయన్నారు. ఫలితంగా వ్యాధుల బారి నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ముఖ్యంగా ఇంట్లో నీరు నిల్వ లేకుండా చూసుకుంటే దోమలు లార్వాలు పెట్టకుండా ఉంటాయన్నారు. దోమలు వృద్ధి చెందకుంటే వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో జోన్ పరిధిలోని అన్ని పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యార్థులు వారి ఇళ్లతో పాటు వీధిలో అందరికీ అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనే లక్ష్యం



బంగారుమెట్టలో స్థానికులకు ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది



మంచినీటి డ్రమ్ములో దోమ లార్వాలను గుర్తిస్తున్న మలేరియా సిబ్బంది

అల్లిపురం : డయేరియా నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి అన్నారు. డయేరియా నిర్మూలనే ధ్యేయంగా స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. అల్లిపురం మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలన డయేరియా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. వాటి నివారణకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలేరియా సిబ్బంది అవగాహన..

సీజనల్ వ్యాధుల పట్ల మలేరియా సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా బంగారుమెట్టలో ఇంటింటికీ వెళ్లి మంచినీటి గోలాలు, పూల కుండీలలో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంచే డ్రమ్ములలో దోమ లార్వాలను గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులను నివారించవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరియా మలేరియా సిబ్బంది మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు డయేరియాపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ వసంతలక్ష్మి

గాంధీ పార్కులో అల్లూరి జయంతి

సీతమ్మధార : జీవీఎంసీ గాంధీ పార్కులో అల్లూరి జయంతి జరిపారు. ముందుగా ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నాయకత్వంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి ఎస్.గోవిందరాజులు మాట్లాడుతూ అల్లూరి నేటికీ జీవించి ఉంటే ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సమర సంఖం పూరించే వారని తెలిపారు. గిరిజనుల కోసం ఆయన అలుపెరుగని పోరాటం చేశారన్నారు. మానవ హక్కుల వేదిక నాయకుడు ఎం.శరత్ మాట్లాడుతూ ప్రకృతి వనరులు, దేశ సంపదను ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా చేసే పోరాటమే నిజమైన దేశ భక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర చైతన్య వేదిక నాయకులు సి.హెచ్. ప్రమీల, కె.శివప్రసాద్, డాక్టర్ పొన్నాడ శ్రీనివాసరావు, కె.అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న అల్లూరి జయంతి నిర్వహణ కమిటీ సభ్యులు

కృష్ణా డిగ్రీ కళాశాలకు ఆర్‌వో ప్లాంట్ వితరణ

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శ్రావణ్ కుమార్ ఆర్‌వో ప్లాంట్ అందజేశారు. ఈ మేరకు ఆర్‌వో ప్లాంట్‌ను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు శ్రేష్ఠమైన తాగునీటిని అందించాలనే సదుద్దేశంతో ఆర్వో ప్లాంట్ వితరణ చేయడం అభినందనీయమన్నారు. అధ్యాపకుడు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జూనోసిస్ వ్యాధులపై అవగాహన

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూనోసిస్ వ్యాధుల గురించి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కళాశాల సహకారంతో వన్ వరల్డ్ వన్ హెల్త్, ప్రివెంట్ జూనోసిస్ పేరుతో జూనోసిస్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎ.కృష్ణవేణి పాల్గొని జూ యానిమల్ కీపర్లు, సందర్శకులకు జూనోసిస్ వ్యాధులు ఏవిధంగా సంక్రమిస్తాయి, వాటి నివారణ, ఆయా వ్యాధులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తదితర వాటి గురించి వివరించారు. అనంతరం జూ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. బీపీ, మధుమేహం, రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలరావు, జూ వైద్యుడు ఫణీంద్ర, సెక్షన్ ఆఫీసర్లు భారతి, రాజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



జూ సిబ్బందిని పరీక్షిస్తున్న ఏఎంసీ వైద్య సిబ్బంది

రసాయనాలతో కాలుష్యం కాటు

పరవాడ: నిబంధనలకు విరుద్ధంగా గెడ్డలు, చెరువుల్లోకి రసాయన వ్యర్థాలు విడుదల చేస్తున్న ఫార్మా యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. భర్నికం సమీపంలోని మొల్లోడి గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థ రసాయనాలను శుక్రవారం పరిశీలించారు. రసాయనాలను శుద్ధి చేసి సముద్రానికి పంపాల్సిన ఫార్మా యాజమాన్యాలు చెరువులు, గెడ్డల్లోకి విడిచిపెట్టడడంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆరోపించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఫార్మా యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లోకనాథం డిమాండ్ చేశారు. ఆయన వెంట సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఉన్నారు.



గెడ్డలోని రసాయన వ్యర్థాలను పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు